దిగుబడులపై గంపెడాశలు

- వరదలు, బుడమేరు ముంపుతో దెబ్బతిన్న వరిపైర్లు
- చిరు పొట్ట దశలో భారీ వర్షాలు
- దిగుబడులపై ఆందోళనలో అన్నదాతలు


పునాదిపాడులో కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలం

కంకిపాడు: వరి పంట చేతికి అందే తరుణం ఆసన్నమైంది. ఆటుపోట్లు అధిగమించి, ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి ఏ మేరకు దక్కుతుందోనన్న ఆందోళనలో అన్నదాతలు ఉన్నారు. ప్రకృతి విపత్తులతో రైతులు కుదేలయ్యారు. పంట దిగుబడులపై ప్రకృతి ప్రకోపం చూపింది. దీంతో గంపెడాశతో దిగుబడి వైపు చూస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కృష్ణాజిల్లా వ్యాప్తంగా 25 మండలాల్లో 1.51 లక్షల హెక్టార్లలో వరి సాగు జరిగింది. ప్రధానంగా ఎంటీయూ, బీపీటీ విత్తన రకాలను రైతులు సాగుకు ఎంచుకున్నారు. తొలకరి వర్షాల పలకరింపుతో జిల్లాలో తొలుత పెనమలూరు, గన్నవరం నియోజకవర్గంతో పాటుగా పామర్రు తదితర నియోజకవర్గాల్లో రైతులు వరి నారుమడులు పోసుకుని సాగుకు ఉపక్రమించారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఎకరాకు 18 బస్తాలు నుంచి 22 బస్తాలు వరకు కౌలు ఒప్పందాలు చేసుకుని రైతులు వరి సాగు చేపట్టారు.

ప్రకృతి విపత్తులతో కుదేలు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలను ప్రకృతి విపత్తులు కుదేలు చేశాయి. సెప్టెంబర్ మొదటి వారంలో కృష్ణానది ఎన్నడూ లేని విధంగా 11.42 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరింది. వరద నీటిలో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. బుడమేరు వరద ఉధృతికి జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. అధికారికంగా ప్రాథమిక అంచనాల ప్రకారం 48,641 హెక్టార్లలో పంట పొలాలు నీట మునిగాయి. దీనిలో 44,521 హెక్టార్లు వరి పంట దెబ్బతిన్నట్లు అంచనా. వరదలు, భారీ వర్షాల నుంచి తేరుకుని రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వరి పొలాలు చిరు పొట్ట దశ నుంచి కంకి గట్టిపడే దశలో ఉన్నాయి. ఈ తరుణంలో అడపా దడపా మోస్తరు వర్షాలు పడటంతో సుంకు రాలిపోయి తాలు, తప్ప ఏర్పడుతుందని, మానుగాయతో పంట దిగుబడులకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దిగుబడులు ఏ మేరకు దక్కేనో ?

వరుసగా ప్రకృతి విపత్తులు సంభవించటంతో పాటుగా దోమ ఉధృతి అధికంగా ఉంది. భారీ వర్షాలు, వరదలతో పంటలకు నష్టం వాటిల్లింది. పంట కంకి గట్టిపడేదశకు చేరుకున్నాక మోస్తరు వర్షాలు పడటంతో తాలు, తప్ప, మానుగాయతో ఎకరాకు 5 నుంచి 7 బస్తాలు వరకు దిగుబడులు తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 35 బస్తాలు మించి దిగుబడి వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు. తాజా వాతావరణ పరిస్థితుల కారణంగా దిగుబడులపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టుబడులు, కూలి ఖర్చులు చేతికి అందినా చాలన్న భావన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ లావణ్యకుమారి

విజయవాడరూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి కె.లావణ్యకుమారి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో విజయవాడ డివిజనల్ స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు. ఈసందర్భంగా డీపీఓ మాట్లాడుతూ వర్షాకాలం నుంచి శీతాకాలం మారుతున్న నేపథ్యంలో సంభవించే వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది సహకారం తీసుకోవాలని చెప్పారు. నీరు నిల్వ ఉండరాదని, మురుగునీరు, గార్బేజ్ ఎప్పటికప్పుడు తొలగించి చెత్త డంపింగ్ యార్డుల్లో డంప్ చేయాలన్నారు. దోమల నివారణ, తాగునీటి పైపులైన్లకు లీకులు లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు క్లోరినేషన్, పారిశుద్ధ్య పనులు నిర్వహించాలన్నారు. గ్రామ కార్యదర్శులు వారి వారి గ్రామాల్లోనే ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన వివిధ రకాల పన్నుల వసూలు సకాలంలో పూర్తి చేసి ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలన్నారు. పీఆర్ వన్ యాప్ అండ్ కమ్యూనిటీ ఎసెట్స్‌పై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డీఎల్‌పీఓ ఇన్‌చార్జి ప్రసాద్, విస్తరణ అధికారులు జయప్రకాష్, శ్రీనివాస్, మనోజ్ కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కూలీల డిమాండ్ ఆధారంగా ఉపాధి పనులు


పీడీ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న కె.సీతారామపురం గ్రామస్తులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఉపాధి హామీ కూలీల నుంచి అధికంగా డిమాండ్ ఉన్న చోట్ల పొరుగు గ్రామాల్లో సైతం పనులు కేటాయిస్తామని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్వీ శివప్రసాద్ తెలిపారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు కె.సీతారామపురం గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఫీల్డ్ అసిస్టెంట్ మరియమ్మపై ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద పనులు మంజూరు చేయటం లేదని, ఉపాధి కూలీలకు పని కేటాయించటం లేదని ఆరోపించారు. దీనిపై విచారణ నిర్వహిస్తామని గ్రామస్తులకు పీడీ శివప్రసాద్ హామీ ఇవ్వటంతో పాటుగా ఫీల్డ్ అసిస్టెంట్ మరియమ్మను తాత్కాలికంగా సస్పెండ్ చేశారు.

రాజకీయ కక్షతో ఉద్యోగం తొలగించటం సరికాదు..

మండలంలో చేపట్టిన వివిధ ఉపాధి హామీ పనుల రికార్డుల తనిఖీలో రూ.70 వేలు వ్యత్యాసం వచ్చినట్లుగా అధికారులు గుర్తించారు. దీనికి బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ నాంచారావు, క్వాలిటీ కంట్రోల్ అధికారి సురేష్, ఎంపీడీఓ జోగేశ్వరరావు, ఏపీఓ అశోక్‌కుమార్, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని పాల్గొన్నారు. కె.సీతారామపురం ఫీల్డ్ అసిస్టెంట్ మరియమ్మ వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలు అనే అక్కసుతోనే ఆమెపై అవాస్తవాలను ఉన్నతాధికారులకు నివేదించారని ఆ గ్రామ ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెన్నుబోయిన శివయ్య వాపోయారు. అకారణంగా రాజకీయ కక్షతో ఉద్యోగం తొలగించటం సబబు కాదన్నారు.

పంచాయతీ స్థలం ఆక్రమణ


ఎనికేపాడు పంచాయతీ స్థలంలో పిల్లర్ నిర్మించిన దృశ్యం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు సీఎస్ఐ చర్చి సమీపంలో పంచాయతీ స్థలం, డ్రెయిన్‌ను ఆక్రమిస్తూ పిల్లర్లు వేయడం వివాదాస్పదమైంది. కమ్యూనిటీ హాల్ సమీపంలో ఈ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి పంచాయతీ స్థలం ఆరు అడుగులు ఆక్రమించి ఆగర్లు తీసి పిల్లర్లు వేశారు. ఇక్కడి డ్రెయిన్ మీదుగా షెడ్డు నిర్మించి వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకోవడానికి సిద్ధమవడంతో పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. డ్రెయిన్‌ను ఆక్రమిస్తే మురుగునీరు ప్రవాహానికి ఆటంకంగా మారుతుందని ఈ ప్రాంతవాసులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఆక్రమణకు పాల్పడిన వ్యక్తి టీడీపీకి చెందిన వ్యక్తి కావడంతో పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ ఆక్రమణను అడ్డుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సబ్సిడీ గ్యాస్ సిలెండర్లు సక్రమంగా అందించాలి

కంకిపాడు: సబ్సిడీ గ్యాస్ సిలెండర్లు వినియోగదారులకు సక్రమంగా అందజేయాలని తహసీల్దార్ వి.భావన్నారాయణ ఆదేశించారు. మండల పరిధిలోని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సబ్సిడీ గ్యాస్ సిలెండర్లు అందాలన్నారు. సబ్సిడీ సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ కాకపోతే సచివాలయాల్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అర్హులందరికీ సబ్సిడీ గ్యాస్ అందాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: ఎనికేపాడులో సురక్షిత తాగునీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. గ్రామంలో తాగునీటి వాటర్ పైప్‌లైన్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. ప్రధాన గ్రామంతో పాటు కాల్వ గట్టు ప్రాంతాల్లో సురక్షిత తాగునీరు అందిస్తున్నామన్నారు. మొత్తం 15 మోటారు బోర్లు, వాటర్ ట్యాంక్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని, మరో రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణం పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వాటర్ పైప్‌లైన్ విస్తరణ పనులు పూర్తి అయ్యాయని, త్వరలో నూతన ట్యాంకులను ప్రారంభిస్తామన్నారు.

చెట్ల కొమ్మలను తొలగించండి

సూరంపల్లి(గన్నవరం): మండలంలోని సూరంపల్లి శివారు రామచంద్రపురం అడ్డరోడ్డు వద్ద చెట్ల కొమ్మలను నరికివేసి రహదారిపై పడవేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల విద్యుత్ సరఫరా వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను ఆ శాఖ సిబ్బంది నరికివేశారు. అయితే చెట్ల కొమ్మలను పక్కకు తొలగించకుండా నిర్లక్ష్యంగా రోడ్లపైన సిబ్బంది వదిలివేశారు. దీనివల్ల వాహనదారులకు అసౌకర్యంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ సిబ్బందికి చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. దీనిపై సున్న విద్యుత్ శాఖ ఏఈ శివారెడ్డి వివరణ కోరగా రోడ్డుపై పడవేసిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని 'సాక్షి'కి తెలిపారు.

తాపీ మేస్త్రీ ఆత్మహత్య

రామవరప్పాడు: ఉరి వేసుకుని తాపీ మేస్త్రీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామవరప్పాడులో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పటేల్‌నగర్‌లో గద్దల అశోక్(37), భార్య మరియమ్మ, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. అశోక్ అపార్టుమెంట్ వాచ్‌మెన్‌గా ఉంటూ తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం భార్య ఇంటి బయట పని చేస్తుండగా అశోక్ గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. విషయం తెలుసుకుని స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి ఉరికి వేలాడుతున్న అశోక్‌ను దింపి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆత్మహత్యకు గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.11 లక్షల టోకరా

పెనమలూరు: కానూరులో యువతికి సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంచి ప్యాకేజీతో ఉద్యోగం ఇప్పిస్తానని సైనికోద్యోగి నమ్మించి రూ.11 లక్షలు స్వాహా చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు పెద్దబావి సెంటర్‌కు చెందిన యువతి బీటెక్ చదివింది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో విజయవాడకు చెందిన పాలకొల్లు రోహిత్‌సాయి అనే వ్యక్తి 2018వ సంవత్సరంలో పరిచయమయ్యాడు. అతను ఇండోటిబెటిన్ బోర్డర్‌లో సైనికుడిగా పని చేస్తున్నాడు. యువతి 2021 సంవత్సరంలో బీటెక్ 3వ సంవత్సరంలో ఉన్న సమయంలో తనకు తెలిసిన మిత్రులతో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. ఐటీ సెక్టార్‌లో రూ.20 లక్షలతో ఉద్యోగం ప్యాకేజీతో ఇప్పిస్తానని, దానికి రూ 10 లక్షలు ఖర్చు అవుతుందన్నాడు. అతని మాటలు నమ్మిన యువతి పలు దఫాలుగా రూ.11 లక్షలు రోహిత్‌సాయికి ఇచ్చింది. ఆ తరువాత అతను మొఖం చాటేశాడు. జరిగిన మోసంపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సమాజంలో అవినీతిని నిర్మూలించాలి

పెనమలూరు: సమాజంలో అవినీతిని నిర్మూలించటానికి ప్రతీ పౌరుడు తమ వంతు కృషి చేయాలని కేంద్ర పురావస్తు శాఖ అమరావతి అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ జైనా అన్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ ఆదేశాల మేరకు అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా కానూరులో అవినీతి నిర్మూలనపై భారత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి రహిత సమాజాన్ని నెలకొల్పడానికి ప్రతీ పౌరుడు తన వంతు కృషి చేయాలన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. ర్యాలీలో నోడల్ అధికారి, సహాయ పురావస్తు శాఖ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు, అధికారులు డాక్టర్ దేబేంద్రనాథ్ బోయి, జి.సూర్యప్రకాష్, భానుప్రకాష్‌వర్మ, స్వామి, వీపీ మహోద్, పలువురు అధికారులు, పెద్ద సంఖ్యలో ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

లయోలా విద్యార్థుల కమ్యూనిటీ టీచింగ్ ప్రోగ్రామ్

నున్న(విజయవాడరూరల్): ఆంధ్ర లయోలా కాలేజ్ ఆంగ్ల విభాగం, ఈఎల్‌టీ సెంటర్, విజయవాడ రోటరీ క్లబ్(చార్టర్‌నెం-15612), గుడ్ న్యూస్ మినిస్ట్రీస్, నున్న సహకారంతో మంగళవారం ఫీల్డ్ సందర్శనల ద్వారా అనుభవాత్మక అధ్యయనంలో భాగంగా టీచింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రొటేరియన్ డాక్టర్ వి.శ్రీదేవి మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో ఆంగ్ల భాషా నైపుణ్యాల ప్రాధాన్యతను వివరించారు. అంతర్జాతీయ వేదికపై పోటీ పడేందుకు భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. కమ్యూనిటీ టీచింగ్ ప్రోగ్రామ్ లక్ష్యాలను ఆంగ్ల విభాగాధిపతి ఎస్.రంగబాబు వివరించారు. ఆంగ్ల భాషా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని నున్న జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వి.భూపాల్ రెడ్డి సూచించారు. పాఠశాల సహాయకులు సురేష్, త్రిపుర సుందరి పాఠశాల స్థాయిలో అంతర్జాతీయ భాషల బోధనపై విలువైన సూచనలు పంచుకున్నారు.

సమ్మె విరమించిన మున్సిపల్ వ్యాన్ డ్రైవర్లు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో కొద్ది రోజులుగా చెత్త తొలగించే వ్యాన్ డ్రైవర్లు చేస్తున్న సమ్మెను మంగళవారం విరమించి, విధుల్లో చేరారు. తాడిగడప మున్సిపాలిటీలో చెత్త తరలించటానికి 42 వ్యాన్‌లు ఉన్నాయి. అయితే ప్రభుత్వం గత మూడు నెలలుగా వ్యాన్ డ్రైవర్లకు జీతాలు చెల్లించడం లేదు. దీంతో డ్రైవర్లు సమ్మెకు దిగటంతో సీఐటీయూ, మున్సిపాలిటీ కార్మికులు మద్దతు పలికారు. ఈ నెల 14 నుంచి డ్రైవర్లు సమ్మెకు దిగడంతో మున్సిపాలిటీ పరిధిలో చెత్త కుప్పలు ఎక్కడపడితే అక్కడ ఉండిపోయి దారుణమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే వ్యాన్ డ్రైవర్లకు ప్రభుత్వం జీతాలు మంగళవారం ఇవ్వటంతో సమ్మె విరమించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ.. కార్మికులు ఐక్యంగా ఉండి పోరాటం చేయటం వలనే జీతాలు అందాయన్నారు. ఇకమీదట కార్మికుల జీతాలు ఆలస్యం చేయకుండా కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

క్యాట్ ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

కంకిపాడు: కంకిపాడు శ్రీచైతన్య విద్యార్థులు క్యాట్(నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్)లో సత్తా చాటారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మంగళవారం విద్యార్థులను అభినందించారు. క్యాట్‌లో వివిధ విభాగాల్లో 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ దిశగా అడుగులు వేయిస్తున్నామన్నారు. ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ ధీరేంద్ర, డీన్ నాగేశ్వరరావు, టీచర్లు పాల్గొన్నారు.

యాంత్రీకరణ పద్ధతులు అవలంభించాలి

కంకిపాడు: సాగులో యాంత్రీకరణ పద్ధతులు అవలంభించాలని ఏఓ పీఎం కిరణ్ సూచించారు. మండలంలోని మంతెన, జగన్నాథపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పంట పొలాల్లో దోమ ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించారు. డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేసే విధానం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అధునాతన సాంకేతిక పద్ధతులను రైతులు అనుసరించాలన్నారు. దోమ నివారణకు చెస్ 100 గ్రాముల మందును పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు కె.సురేష్, ప్రియ, పద్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ సుదిమళ్ల రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీలకు బాపులపాడు మండలం వీరవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని వి.నాగరూపిత ఎంపికైనట్లు హెచ్ఎం పి.నిర్మల మంగళవారం తెలిపారు. ఇటీవల గుడివాడలో జరిగిన అండర్-14 ఖోఖో జిల్లా జట్టు ఎంపికలో నాగరూపిత ఉత్తమ ప్రతిభ కనబర్చిందన్నారు. వచ్చే నెల 7వ తేదీ నుంచి పల్నాడు జిల్లా కారంపూడిలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో నాగరూపిత కృష్ణాజిల్లా జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. నాగరూపితను హెచ్ఎం నిర్మల, వ్యాయామోపాధ్యాయుడు లక్ష్మణరావు, స్టాఫ్ సెక్రటరీ రమణగోపాల్ అభినందించారు.

క్లుప్తంగా

విద్యార్థులు స్కిల్స్ పెంపొందించుకోవాలి

ఉయ్యూరు: విద్యార్థులు స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ మల్లేశ్వరరావు తెలిపారు. ఇండస్ట్రియల్ విజిట్స్‌తో స్కిల్స్‌పై అవగాహనా కార్యక్రమంలో భాగంగా జెడ్పీ పాఠశాల విద్యార్థులు మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్, ఏఈఈ కార్యాలయాలను సందర్శించారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లెర్నెట్ ఆధ్వర్యంలో 9, 10 తరగతుల విద్యార్థులు 33 కె.వి.విద్యుత్ సబ్‌స్టేషన్ క్షేత్ర సందర్శన చేశారన్నారు. లైన్‌మెన్ శశిధర్, ఇన్‌చార్జి హెచ్ఎం సుమంత్, ఒకేషనల్ ట్రైనర్ వినోద పాల్గొన్నారు.

కానూరులో యథేచ్ఛగా అక్రమ నిర్మాణం



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు అశోక్‌నగర్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా దుకాణాలను అక్రమంగా నిర్మిస్తున్నారు. విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారి పక్కనే యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నా అధికారుల్లో స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై మున్సిపాలిటీ ఏసీపీ రంగప్రసాద్‌ను వివరణ కోరగా నోటీసులిచ్చి నిర్మాణం ఆపామన్నారు.

కలుపు మందు తాగిన వృద్ధుడి మృతి

పెనమలూరు: కలుపు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు మంగళవారం మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ రాజరాజేశ్వరీపేటకు చెందిన షేక్.రజియాసుల్తానా కుటుంబ సభ్యులతో నివాసం ఉంటుంది. ఆమె తల్లి అబ్దుల్ జరీనాబేగం రెండు నెలల క్రితం మృతి చెందింది. రజియాసుల్తానా తండ్రి అబ్దుల్‌రషీద్ అహ్మద్(62) కుమార్తె వద్ద ఉంటున్నాడు. కాగా ఈ నెల 26న అబ్దుల్‌రషీద్ అహ్మద్ కలుపు మందు తాగి వాంతులు చేసుకుంటుంటే అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో వైద్యానికి చేర్చారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అనారోగ్య కారణాలతో తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పారిశుద్ధ్య కార్మికుడిపై దాడి

గన్నవరం: గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడిపై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన స్థానిక చింతలపేటలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక గ్రామ పంచాయతీలో తూము ఏసుబాబు కాంట్రాక్ట్ కార్మికుడిగా పారిశుద్ధ్య విధుల్లో పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సహచర కార్మికులతో కలిసి స్థానిక చింతలపేటలో ఇళ్ల నుంచి చెత్త సేకరణకు ఏసుబాబు వెళ్లాడు. అయితే ప్రతి రోజు తన ఇంటి నుంచి చెత్త తీసుకువెళ్లడం లేదని చింతలపేటకు చెందిన షబ్బీర్ అతనితో గొడవ పెట్టుకున్నాడు. అంతే కాకుండా ఏసుబాబుపై షబ్బీర్ దాడి చేసి కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా దాడిచేసిన షబ్బీర్ చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం, ఈఓ చెన్నకేశవులు పోలీసులను కోరారు.

కాలువలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య



కంకిపాడు: కాలువలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ డి.తాతాచార్యులు తెలిపిన కథనం మేరకు... మండలంలోని గొడవర్రు గ్రామానికి చెందిన ఉప్పులేటి మేరీ గ్రేస్ (70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. అనారోగ్యం బాధ తాళలేక కంకిపాడు లాకులు సమీపంలోని బందరు కాలువ రేవులోకి దిగి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహం బందరు కాలువకు అనుబంధంగా ఉన్న వల్లూరు పడమట కాలువ లాకుగేట్లు వద్ద ఇరుక్కుపోవటంతో స్థానికులు గుర్తించి పోలీసులు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ వి.భావన్నారాయణ పర్యవేక్షణలో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్ఐ తాతాచార్యులు తెలిపారు.